ప్రజా సమస్యలపై నిలదీత

- అధికారులను ప్రశ్నించిన ప్రజాప్రతినిధులు
- వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం
- మిగులు బడ్జెట్ ఆమోదం



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

అమలాపురం రూరల్: ప్రజా సమస్యలపై ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీయడంతో మండల పరిషత్ బడ్జెట్ సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బడ్జెట్ సమావేశం జరిగింది. అధికారులు శాఖల వారీగా వివరాలు సమర్పించారు. గృహ నిర్మాణ శాఖ డీఈఈ ప్రసాదరాజు మాట్లాడుతుండగా, గున్నేపల్లి అగ్రహారం సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు జోక్యం చేసుకుని, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు హౌసింగ్ రుణాలు ఇవ్వరా అంటూ ప్రశ్నించారు. దీంతో డీఈఈ నుంచి సమాధానం రాకపోవడంతో, ఎంపీపీ సొంత ఊరికి హౌసింగ్ రుణాలు మళ్లించారంటూ రామచంద్రరావు ఆరోపించారు. దీంతో ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్ కల్పించుకుని, అన్ని గ్రామాలను సమానంగానే చూస్తూ నిధులు మంజూరు చేశారని రామచంద్రరావుకు వివరణ ఇచ్చారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కరెళ్ల రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ఒక గ్రామానికే హౌసింగ్ రుణాలు మళ్లించారనడంలో వాస్తవం లేదని, ఆరోపణలను నిరూపించాలంటూ రామచంద్రరావుకు సవాల్ విసిరారు. సమస్యలపై అడిగే విధానంలో పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. జగనన్న లేఅవుట్లలో 2,015 ఇళ్లు మంజూరయ్యాయంటూ డీఈఈ సమాధానం ఇచ్చారు. ఈదరపల్లి ఎంపీటీసీ అడపా సత్తిబాబు మాట్లాడుతూ హౌసింగ్ రుణాల బిల్లులు ఎప్పుడు పడతాయంటూ ప్రశ్నించగా, వేస్తామంటూ డీఈఈ సమాధానమిచ్చారు. తాండవపల్లి ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రత్యక్షంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల మాటకంటే, గ్రామ వలంటీర్ల మాటలే వింటున్నారంటూ ఆవేదన వెళ్లగక్కారు.

ట్యాంకర్ల ద్వారా మంచినీరు ఇవ్వండి

సాకుర్రు సర్పంచ్ గుత్తుల చిరంజీవరావు మాట్లాడుతూ వేసవికాలంలో మండల పరిషత్ నిధుల నుంచి సాకుర్రు గ్రామానికి ట్యాంకర్ల ద్వారా మంచినీళ్లు పంపించాలంటూ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చినబాబు, ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. చిందాడగరువు జనతా కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ పేర్కొన్నారు. కామనగరువు, రోళ్లపాలెం బైపాస్ జంక్షన్ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సమావేశంలో ప్రస్తావించారు. గేదెలకోడు డ్రైన్ పూడిక తీత పనులు చేపట్టాలంటూ సర్పంచ్ ఏసుబాబు డ్రైనేజీ శాఖ ఏఈని కోరారు.

బడ్జెట్ ఆమోదం

సమావేశం వాడీవేడిగా జరిగింది. అనంతరం మండల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2024–25 సంవత్సరం అంచనా రూ.1.60 లక్షలు మిగులు బడ్జెట్ సమావేశం ఆమోదించింది. బడ్జెట్‌లో అన్ని పద్దుల కింద రూ.91,28,37,000 ఆదాయంగాను, రూ.91,26,77,000ను వ్యయంగా పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ దంగేటి డొలమణి, వైస్ ఎంపీపీ అడపా సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ గుబ్బల మల్లికార్జునరావు, సర్పంచులు చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, రేలంగి దుర్గారావు, పోనకల గణేష్, కోఆప్షన్ సభ్యులు మొసలి స్వర్జన్‌రాజు ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ నిధుల మంజూరు

మండల పరిషత్ ఏఈ రాధాకృష్ణ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మండలానికి రూ.60 లక్షల వంతున నిధులు మంజూరయ్యాయని వివరించారు. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయాలను త్వరితగతిన పూర్తి చేయాలంటూ జెడ్పీటీసీ, ఎంపీపీలు ఏఈకి సూచించారు. తాండవపల్లి పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులు ముగించాలని సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు ఏఈ దృష్టికి తీసుకువచ్చారు. ఈదరపల్లి గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తారా అంటూ ఎంపీటీసీ అడపా సత్తిబాబు ప్రశ్నించారు.

క్లుప్తంగా

ఘనంగా నక్షత్ర పూజలు


ప్రత్యేకాలంకరణలో భూసమేత వేంకటేశ్వర స్వామివారు

ఉప్పలగుప్తం: భీమనపల్లిలోని భూసమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ కె.కార్తీక, వరదా శ్రీరామ చంద్రమూర్తి ఆధ్వర్యంలో పురోహితులు పెద్దింటి శ్రీనివాసాచార్యులు స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు చేసి, పూర్ణాహుతి జరిపారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, అన్న సమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఇళ్ల స్థలాలు చూపించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: తమకు ప్రభుత్వం అందించిన ఇళ్ల స్థలాలు చూపించాలని మండలంలోని సన్నవిల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ టి.మల్లికార్జునరావుకు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందించారు. గ్రామంలో 34 మందికి వేరే గ్రామాల్లో ఇళ్ల స్థలాలు అందించారని, వాటిని గుర్తించి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చిక్కం జంగమయ్య, సచివాలయ కన్వీనర్ చిక్కం నాగబాబు పాల్గొన్నారు.

చొల్లంగి అమావాస్య పుణ్య స్నానాలు


పార్వతీ సమేత రామేశ్వరస్వామి

అల్లవరం: చొల్లంగి అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఎస్.పల్లిపాలెం పంచాయతీ పరిధి ఎస్.రామేశ్వరం సముద్ర తీరంలో భక్తులు శుక్రవారం సముద్ర స్నానాలు ఆచరించారు. తీరంలో ఉన్న పార్వతీ సమేత రామేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ మహోత్సవాలు నిర్వహించారు.

అంబులెన్స్, గూడ్స్ ఆటో ఢీ



సంఘటన స్థలంలో అంబులెన్స్, గూడ్స్ ఆటో

అమలాపురం రూరల్: అమలాపురం–ముమ్మిడివరం గేట్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున అంబులెన్స్, ట్రక్కు ఢీకొన్నాయి. వివరాల్లోకి వెళితే, ఏరియా ఆస్పత్రి వైపు వెళ్తున్న 108 అంబులెన్స్.. గడియార స్తంభం వైపు వెళ్తున్న గూడ్స్ ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో గూడ్స్ ఆటో ధ్వంసమైంది. రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభం అంబులెన్స్‌పై విరిగిపడింది. జనిపల్లికి చెందిన గూడ్స్ ఆటో డ్రైవర్ అల్లపల్లి వీరవెంకట సత్యనారాయణకు తీవ్ర గాయాలు కాగా, అంబులెన్స్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన సత్యనారాయణను అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆశా వర్కర్ల ధర్నా

తాళ్లరేవు: తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ ఆశా వర్కర్లు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. స్థానిక సంతపేట సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబుకు ఆందోళనకారులు వినతిపత్రం అందజేశారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి


శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ముమ్మిడివరం: ఇంటింటికీ ఉచితంగా వైద్య సేవలందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పెద్దిరెడ్డి మునీంద్రరావు అన్నారు. గాడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునీంద్రరావు అధ్యక్షత వహించారు. వైద్యులు 363 మందికి వైద్య సేవలందించారు.అవసరమైన మేరకు వైద్యులు ఈసీజీ, ఎక్స్‌రే టెస్టులు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గిరిగి కోదండపాణి, గిరిగి సత్యసాయిరామ్, వరసాల సత్యనారాయణ, వైద్యులు ఏ.మణి, కె.సింధూజ, ఎం.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన ఎస్ఈ


వెంకన్న చెరువు ఆధునీకరణపై గ్రామస్తులతో చర్చిస్తున్న ఎస్ఈ శ్రీనివాస్

అల్లవరం: కొమరగిరిపట్నం పంచాయతీలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ (వెంకన్న చెరువు) ఆధునీకరించేందుకు అవసరమైన సాంకేతిక అంశాలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.4.95 కోట్లతో చేపట్టే ఆధునీకరణ పనులను ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావుతో కలసి ఆయన పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ శ్రీనివాస్ మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లోని నిల్వ చేసిన నీటి లీకేజీని అరికట్టడానికి అడుగు భాగం బెడ్ కార్పెట్ ఇంప్రూవ్‌మెంట్ చేయాల్సి ఉందన్నారు. వారం రోజుల్లో ఆధునీకరణ పనులు నిర్వహిస్తామని, ఏప్రిల్ 15 నాటికి పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకొస్తామని వివరించారు. దీనివల్ల తాగునీటి సమస్య తీరుతుందన్నారు. ఆయన వెంట ఈఈ ఎస్వీ కృష్ణారెడ్డి, డీఈ పార్థసారథి, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, బొంతు సత్యనారాయణ, కొనుకు బాబురావు, కార్యదర్శి ఎస్వీవీ సత్యనారాయణ, ఏఈ స్వామి తదితరులు ఉన్నారు.

లబ్ధిదారుల పేర్లు గల్లంతు

అధికారుల నిర్లక్ష్యంతో స్థలాలు కోల్పోయిన 18 మంది


పట్టా ఉండి ఆన్‌లైన్‌లో స్థలం కోల్పోయిన పార్వతీదేవి

అల్లవరం: పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా నిరుపేదలకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన స్థలాల రిజిస్ట్రేషన్‌లో దేవగుప్తం పంచాయతీ పరిధిలో 18 మంది లబ్ధిదారుల పేర్లు గల్లంతయ్యాయి. దేవగుప్తం పంచాయతీలోని నల్లగుంటలో 109 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై హక్కు కల్పిస్తూ ఈ నెల రెండు నుంచి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. దేవగుప్తం సచివాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేసిన 109 ఇళ్ల స్థలాల జాబితాలో 18 మంది లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్‌లో గల్లంతయ్యాయి. వాటి స్థానంలో 90 డేస్‌లో దరఖాస్తు చేసుకున్న 18 మందికి ప్రస్తుత వీఆర్ఓ వీర్రాజు ఆధ్వర్యంలో పట్టాలు ఇచ్చారు. ఇటీవల ఇచ్చిన పట్టాలకు మాత్రమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోంది. 2020లో పంపిణీ చేసిన పట్టాల జాబితాల్లో 18 మంది పేర్లు లేవు. ఇప్పటి వరకూ 109 మంది లబ్ధిదారులకు గాను, 65 మందికి ఇళ్ల స్థలాలపై హక్కు కల్పించారు. ఇంకా 45 మందికి రిజిస్ట్రేషన్ చేయవలసి ఉంది. ఇప్పటి వరకు జరిగిన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో 8 మంది లబ్ధిదారులు చిట్టూరి దుర్గ, చిట్టూరి పార్వతీదేవి, యలమంచిలి గంగాభవాని, పితాని నాగదుర్గ, వై పార్వతి, అయితాబత్తుల రాణి, జల్లి అనుపమ, గెద్దం రమణ ఇళ్ల స్థలాలను కోల్పోయారు. అప్పట్లో పంపిణీ చేసిన పట్టాలు 18 మంది లబ్ధిదారుల వద్ద ఉండగానే, ఆ స్థలాలకు కొత్త పట్టాలు ఎలా ఇచ్చారనేది ఉన్నతాధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. వీఆర్ఓ అనర్హుల నుంచి సొమ్ము వసూలు చేసి, అర్హుల పట్టాలను రద్దు చేశారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. దీనిపై వీఆర్ఓ వీర్రాజుని వివరణ కోరగా, తనకు ఏమీ తెలియదని, అప్పటి వీఆర్ఓ శివార్జునరావు ఇందుకు కారణమని సమాధానమిచ్చారు.

విద్యార్థులకు ఆర్ఏఎఫ్ ఓపెన్ హౌస్


విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ, ఆర్ఏఎఫ్ డీపీ

అమలాపురం టౌన్: ఆర్ఏఎఫ్ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్పీ ఎస్.శ్రీధర్, ఏఎస్పీ ఖాదర్ బాషా, ఆర్ఏఎఫ్ డీపీ బాగెల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అమలాపురం సర్ సీవీ రామన్ పాఠశాల విద్యార్థులకు ఆర్ఏఎఫ్‌లో వివిధ రకాల ఆయుధాలను ఎలా ఉపయోగిస్తారో అవగాహన కల్పించారు. ఆయుధాల ఉపయోగాన్ని విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. పాఠశాల డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలను కాపాడడంలో ఆర్ఏఎఫ్ సేవలను కొనియాడారు, డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

11న పంచవక్త్ర విరాట్ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ


తాళ్లరేవులో ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న గోవిందకుమార్

తాళ్లరేవు: ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎదుర్లంక వారధి వద్ద నూతనంగా నిర్మించిన పంచవక్త్ర విరాట్ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ కోరారు. శుక్రవారం ఈ మేరకు తాళ్లరేవులో ఏర్పాటు చేసిన ప్రచార ఆటోను గోవిందకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులందరూ పెద్దఎత్తున తరలివచ్చి, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్, ఉప సర్పంచ్ కామాడి భైరవమూర్తి, నాయకులు రేవు మల్లీశ్వరి, ఆకుల వెంకటేశ్వర్లు, పెయ్యల శ్రీనివాస్, పెసింగి వర్మ, కర్రి ఆదినారాయణ, బొంతు మోహన్, గెద్దాడ బూరియ్య, కట్టిమేను విష్ణు, రేవు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దళిత నేత ఏడుకొండలుకు సత్కారం


ఏడుకొండలును సత్కరిస్తున్న దళిత నాయకులు

తాళ్లరేవు: విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన దళిత నాయకుడు వడ్డి ఏడుకొండలును శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెయ్యల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏడుకొండలును దుశ్శాలువాతో సత్కరించారు. చిన్నతనం నుంచి నాయకత్వ లక్షణాలు కలిగిన ఏడుకొండలు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి, ప్రస్తుతం రాష్ట్ర స్థాయికి వెళ్లడం అభినందనీయమని పలువురు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి గిరిబాబు, వాకపల్లి చిరంజీవి, విప్పర్తి శ్రీనివాస్, తాడి షణ్ముఖరాజు, చెల్లి దాసు, జక్కల చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు.. ప్రగతికి అవరోధాలు


కళాకారులతో ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, వెంకటేశ్వరరావు తదితరులు

ఆకట్టుకున్న జేవీవీ కళాజాతా

అమలాపురం రూరల్: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన కళాజాతా పదర్శనలు ఆకట్టుకున్నాయి. గేయాలు, సైన్స్ రూపకాలు, నాటికల ద్వారా 21 మంది కళాకారులు రెండు గంటల పాటు ప్రదర్శనలిచ్చారు. హిందూ, ముస్లిం, క్రైస్తవుడు.. పేరేదైనా మానవులే అంటూ అనేక కళారూపాలతో పాటు, మూఢ నమ్మకాలను ఎండగట్టారు. అమ్మకొడుకులు అందరూ అన్నదమ్ములే. సుందర భారతం అందరిదీ అంటూ గొంతెత్తి పాడారు. తొలుత సభకు జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్ ప్రసంగించారు. కళాజాతాకు జేవీవీ రాష్ట్ర నాయకుడు జి.మురళీధర్ నాయకత్వం వహించారు. తొలుత జిల్లా కార్యదర్శి ఖాజా మొహిద్దీన్ స్వాగతం పలికారు.

ఎస్పీ రాజశేఖరన్ బాధ్యతల స్వీకరణ



యానాం: యానాం నూతన సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా రాజశేఖరన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన రఘునాయగం బదిలీపై పుదుచ్చేరి వెళ్లడంతో, ఆయన స్థానంలో రాజశేఖరన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహణకు కృషి చేస్తానన్నారు. అనంతరం సీఐ షణ్ముగం, ఎస్సైలు నూకరాజు, సుబ్బరాజు, పోలీస్ సిబ్బంది నూతన ఎస్పీని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

11న అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకం

యానాం: రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర నాటకాన్ని ఈ నెల 11న ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి దరియాలతిప్ప గ్రామంలో ఉన్న ఆడిటోరియంలో ప్రదర్శిస్తారని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారు ఈ నాటకాన్ని ప్రదర్శిస్తారని చెప్పారు.

భట్నవిల్లిలో పల్లెకు పోదాం..

అమలాపురం రూరల్: పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా భట్నవిల్లి గ్రామంలో బీజేపై ఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ ఆధ్వర్యంలో శుక్రవారం వరకు మూడు రోజుల పాటు ఇంటింటి పర్యటన నిర్వహించారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నందూరి శ్రీరామ్, దొమ్మేటి జానకి రామారావు, బొక్కా మురహరి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ సీటు బీజేపీకి కేటాయింపు!

యానాం: పుదుచ్చేరి ఏకైక పార్లమెంట్ స్థానాన్ని బీజేపీకి కేటాయించినట్టు శుక్రవారం సీఎం రంగసామి సూచనప్రాయంగా తెలిపారు. ప్రస్తుతం ఎన్ఆర్‌కాంగ్రెస్, బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో ఇరు పక్షాల చర్చల అనంతరం సీటును బీజేపీకి కేటాయించారు. బీజేపీ పుదుచ్చేరి ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్ సురేనా వారం రోజుల కిందట పుదుచ్చేరి వచ్చి సీఎం రంగసామి, మంత్రులతో సమావేశమయ్యారు. బీజేపీ లోక్‌సభ సీటును కోరడంతో సీఎం రంగసామి సైతం అంగీకరించారు. అధికారికంగా ఎన్ఆర్ కాంగ్రెస్ వార్షికోత్సవంలో ప్రకటిస్తామని సీఎం రంగసామి పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించడం చాలా ముఖ్యమని, కూటమి అభ్యర్థి విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. పార్టీ పటిష్టతలో భాగంగా ఐదుగురు సభ్యులతో హై లెవెల్ కమిటీ, పది మంది సభ్యులతో అడ్వయిజరీ కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.


గజమాల యాత్ర కమిటీతో సమీక్ష

రాజోలు: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ గజమాల యాత్ర కమిటీ సభ్యులతో రాజోలు సీఐ గోవిందరాజు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ నెల 19న రాజోలు తాలూకా అగ్నికుల క్షత్రియ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గజమాల యాత్ర కొపనాతి కృష్ణమ్మ స్వగ్రామం ఓడలరేవు నుంచి ప్రారంభమవుతుందని కమిటీ అధ్యక్షుడు చింతా మహానాగరాజు వివరించారు. పేరూరు, మామిడికుదురు, తాటిపాక, పొదలాడ, రాజోలు, మలికిపురం మీదుగా అంతర్వేది వరకు గజమాల యాత్ర కొనసాగుతుందన్నారు. అంతర్వేది విచ్చేసే భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా యాత్ర చేపట్టాలని సీఐ సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలన్నారు. కమిటీ ప్రతినిధులు తిరుమాని రాజు, రామకృష్ణ, కాటాడి ఉమామహేశ్వరరావు, మల్లాడి శ్రీనివాసరావు, భైరవస్వామి పాల్గొన్నారు.

నిత్యాన్న దానానికి రూ.10,116 విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన రాయపురెడ్డి సత్యనారాయణ, శిరీష దంపతులు శుక్రవారం రూ.10,116 విరాళంగా అందించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు. ఈ విరాళాన్ని ఆలయ ఉద్యోగులకు అందించారు. దాత కుటుంబానికి ట్రస్టు బోర్డు సభ్యుడు చిట్టాల సత్తిబాబు, ఆలయ ముఖ్య అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

సర్వేయర్ల సంఘ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ


గ్రామ సర్వేయర్ల సంఘ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ నూపుర్ అజయ్

అమలాపురం రూరల్: ఏపీ గ్రామ సర్వేయర్ల సంఘ డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నూతన క్యాలెండర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ నూపుర్ అజయ్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం క్యాలెండర్‌ను సంఘ నేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డుల అధికారి కె.ప్రభాకర్, స్టేట్ కోఆర్డినేటర్ వి.రఘుదీప్, జిల్లా కోఆర్డినేటర్ బి.ఉమాశంకర్, మండల కోఆర్డినేటర్ సీహెచ్ చాందిని, కె.వీరేష్, వైవీఎస్ పవన్, మహేంద్రకుమార్ పాల్గొన్నారు.

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ శివగాయత్రి


గొల్లవిల్లిలో విద్యార్థులకు మాత్రలను అందిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ

ఐ.పోలవరం: కేశనకుర్రు పీహెచ్‌సీ పరిధిలోని పది సచివాలయాలకు సంబంధించిన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కేశనకుర్రు జెడ్పీ హైస్కూల్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివగాయత్రి, హెచ్ఎం బి.శ్రీనివాస్‌కుమార్, పీహెచ్‌సీ సిబ్బంది విద్యార్థులతో మాత్రలు మింగించారు. ఐ.పోలవరం జెడ్పీ స్కూల్‌లో తహసీల్దార్ బి.రమనాయక్, ఎంపీడీఓ ఎండీ అమిలుజ్మా, హెచ్ఎం యు.సురేష్, పీహెచ్‌సీ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ డి.శివగాయత్రి మాట్లాడుతూ కేశనకుర్రు పీహెచ్‌సీ పరిధిలో 95 శాతం పూర్తయిందని, మిగిలిన వారికి ఫిబ్రవరి 16న మాత్రలు పంపిణీ చేస్తామన్నారు.

ఉప్పలగుప్తం: ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించి, నులి పురుగులను నిర్మూలించాలని అడిషనల్ డీఎంహెచ్ఓ సీహెచ్ భరతలక్ష్మి అన్నారు. గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎల్.రాణి, వైద్యాధికారి ఎల్.నాగార్జున, సీహెచ్ఓ విజయలక్ష్మి, ఐ.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోడిలంక పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. డాక్టర్ సుమ ఆధ్వర్యంలో తూర్పులంక ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలల్లోని విద్యార్థులకు ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మాత్రలను మింగించారు. బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఈ మాత్రలను విద్యార్థులకు అందించారు. డాక్టర్ సుమ మాట్లాడుతూ గోడిలంక పీహెచ్‌సీ పరిధిలో 6,142 మందికి మాత్రలను పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడలి గంగాచలం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


విద్యార్థులకు మాత్రలను వేస్తున్న డాక్టర్ సుమ